క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్: సొనాల, పొచ్చెర విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో శుక్రవారం ఉదయం 9.30ల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. బజార్‌హత్నూర్ మండలంలోని 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.
బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి గ్రామాల విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కోసం సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

విద్యారంగంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

ఎదులాపురం: విద్యారంగంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేశ్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. దేశ మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ విద్యారంగం గురించి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుండి విద్యార్థినులు చదువులకు దూరమయ్యారని ఆరోపించారు. విద్యపై కేంద్రం పూర్తిస్థాయి నియంత్రణ కోసం ప్రయత్నిస్తోందన్నారు.

సమస్యలను సీఎంకు విన్నవిస్తాం

ఎదులాపురం: జిల్లా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను వివరిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా ప్రజలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు కుంటాల రాములు, బెజ్జంకి నర్సింగ్ రావు, అరుణ్ కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

సిరికొండ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన జెండాగూడకు చెందిన గర్భిణి 108లో ప్రసవించింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. సిబ్బంది గ్రామానికి వెళ్లి ఆసుపత్రికి తరలించడంతో మర్గమధ్యలో మగ బిడ్డ జన్మించింది. మెరుగైన వైద్యం కోసం ఇచ్చోడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ కాశీనాథ్, పైలెట్ రవీందర్ తెలిపారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న శుక్రవారం సబ్ జూనియర్ జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెల్యే పాయల్ శంకర్, జబాడే రాష్ట్ర పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో జరగనున్న 33వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. రూ. 50 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 94921 36510 సంప్రదించాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

ఎదులాపురం: ఈ నెల 4న నిర్వహించనున్న జిల్లా సదస్సు, 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు సహకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అనుబంధ కార్మిక, కర్షక సంఘాలు, గురువారం జిల్లా అధికారులకు సమ్మె నోటీస్ అందజేశారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఐసీడీఎస్ అధికారి, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డీఎం వి.కిరీట్, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్, రిమ్స్ కాంట్రాక్టర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. సమ్మెలో పాల్గొనేందుకు కార్మికులకు సహకరించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్క దేవిదాస్ పాల్గొన్నారు.

పంట అమ్మకానికి దారేది?

- పసుపు, మిర్చి అమ్ముకునేందుకు మార్కెట్ కరువు
- మహారాష్ట్రలో విక్రయిస్తున్న రైతులు
- స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్


తలమడుగులో ఆరబెట్టిన మిర్చి పంట

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లాలో పత్తితో పాటు పసుపు, మిర్చి పంటలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. గతంలో రాష్ట్రంలోనే భీంపూర్, తలమడుగు మండలాల్లో అధిక దిగుబడి వచ్చింది. ఇతర రైతులు వీరిని ఆదర్శంగా తీసుకొని పసుపు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పసుపుతో పాటు మిర్చి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు సాధిస్తున్నారు. అధిక దిగుబడి సాధించడంతో గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, క్షేత్రస్థాయిలో వచ్చి పంటలను పరిశీలించారు. దీంతో రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున రైతులు పంటల పరిశీలనకు వచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సాగు చేసిన పంటలను విక్రయించేందుకు సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 600 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. గతంలోనే మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు తప్పా.. అచరణకు నోచుకోలేదు.

రవాణా చార్జీల భారం..

జిల్లాలో మిర్చి, పసుపు పంటలు విక్రయించేందు మార్కెట్ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులు మహారాష్ట్ర ఇతర జిల్లాలకు వెళ్లి పంటలను విక్రయిస్తున్నారు. అక్కడికి వెళ్లి విక్రయించాలంటే నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రవాణా చార్జీలు అధికమవుతున్నాయని వాపోతున్నారు. రవాణా చార్జీలు రూ. 12 వేల నుంచి 25 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులంటున్నారు. కొన్నిసార్లు మార్కెట్ విక్రయించేందుకు రెండు, మూడు రోజుల సమయం పడుతుంది. అప్పుడప్పుడు సరైన ధర లేక నష్టపోతున్నారు. అక్కడి భాష రైతులకు అర్థంకాక మోసాలకు గురవుతున్నారు. కొనుగోలు చేసేందుకు ఒక ధర, గోదాంకి వెళ్లిన తర్వాత మరొక ధర చెల్లిస్తున్నారు. అదేమిటి ప్రశ్నిస్తే పంటను తిరిగి తీసుకువెళ్లామని అంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతిలేక పంటలను తక్కువ ధర విక్రయించాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో మార్కెట్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మిర్చి సాగు చేశాను



మండల కేంద్రంలోని వ్యవసాయ పొలంలో ఎనిమిది ఎకరాలలో మిర్చి సాగు చేశాను. పంటను విక్రయించాలంటే మహారాష్ట్రకు వెళ్లి విక్రయిస్తున్నాం. రవాణా ఖర్చులు, సమయం వృథా అవుతోంది. దీనితో అధిక భారం పడుతోంది. ఆదిలాబాద్ జిల్లాలో పసుపు, మిర్చి మార్కెట్ ఏర్పాటు చేయాలి

– కళ్లెం కరుణాకర్ రెడ్డి

మార్కెట్ ఏర్పాటు చేయాలి



ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పత్తి, సోయాబీన్, జొన్న, పంటలతో పాటు మిర్చి, పసుపు, పంటలు సాగు చేస్తున్నారు. విక్రయించేందుకు మార్కెట్ సదుపాయం లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం జిల్లాలో పసుపు, మిర్చి మార్కెట్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుంది.

– గోక గణేష్ రెడ్డి, జెడ్పీటీసీ

పసుపు, మిర్చి సాగుపై ఆసక్తి



ఆదిలాబాద్ జిల్లాలో పసుపు, మిర్చి అధికంగా సాగు చేస్తున్నారు. మంచి దిగుబడి సాధిస్తున్నారు. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలియజేయడం జరిగింది. ఈ అంశాలను జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తాం.

– రవీందర్, ఏడీఏ ఇన్‌చార్జి

సర్పంచుల సేవలు అభినందనీయం


సర్పంచులన్ సన్మానిస్తున్న జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి

తాంసి: గ్రామాల అభివృద్ధికి సర్పంచుల అందించిన సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ రాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారిని ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేపట్టిన వివిధ పనులను తోటి సర్పంచులతో కలిసి పంచుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీవో స్వప్నశీలతో పాటు బదిలీపై వెళ్తున్న ఎంపీవో సుధీర్‌రెడ్డిని సర్పంచ్‌లు, కార్యదర్శులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో భూమయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సదానంద్, సర్పంచ్‌లు కృష్ణ, వెంకన్న, నర్సింగ్, కేశవ్‌రెడ్డి పాల్గొన్నారు.
బోథ్: నక్కలవాడ తాజా మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్‌ను ఎంపీటీసీ జుగాదిరావ్, గ్రామస్తుల గురువారం ఘనంగా సత్కరించారు. గత ఐదేళ్లుగా సర్పంచ్‌గా సేవలందించి, గ్రామాభివృద్ధి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జ్యోతక్క, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

'దాడి సరికాదు'

ఉట్నూర్‌రూరల్: దళిత ఉద్యోగులపై దాడులు చేయడం సరికాదని అంబేద్కర్ సంఘం ఉట్నూర్ మండల అధ్యక్షుడు బిరుదుల లాజర్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ముడుగు శామ్యూల్‌పై జరిగిని దాడిని ఖండించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దావుల రమేశ్, అచ్చ దేవానందం, వెంకటేశ్, అరవింద్, అజయ్, సంజీవ్, శుక్రచారి, రాములు పాల్గొన్నారు.

పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని సూపర్‌వైజర్ మంజుల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రీస్కూల్ విద్యలో నాలుగేళ్ల పిల్లలకు పాలపిట్ట, మూడేళ్ల వయస్సు గల చిన్నారులకు తంగేడు పువ్వు ప్రీ స్కూల్ బుక్స్‌తో నేర్పించాలన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైనట్లు విద్యార్థి యువజన సంఘాల అధ్యక్షుడు మెస్రం భాస్కర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో నెలరోజులుగా రిలే నిరాహార దీక్ష కొనసాగుతున్నా ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్, ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయం కావాలని కోరుతున్నారని తెలిపారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బంద్‌కు సహకరించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘాల నాయకులు మడావి గణేశ్, గేడం, కేశవ్, సలాం వరుణ్, కోటూరి ప్రవీణ్, రవి, మల్లేశ్ పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం

బోథ్: గత 16 సంవత్సరాలుగా జవాన్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొంది తన సొంత గ్రామమైన మండలంలోని కుచులాపూర్ వచ్చిన సుద్దుల మనోహర్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తమ గ్రామవాసి దేశసేవ చేసి ఉద్యోగ విరమణ చేయడం గర్వంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

జయంతిని విజయవంతం చేయండి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక్ బుద్ధ విహార్‌లో ఈనెల 7న నిర్వహించే రమాబాయి అంబేద్కర్ 126వ జయంతిని విజయవంతం చేయాలని రమాబాయి అంబేద్కర్ మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు శోభ తుల్జాపురే పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలి కార్యదర్శి బేబీబాయి కానిందే, ఉపాధ్యక్షురాలు అరుణబాయి జాదవ్, కోశాధికారి సులోచన, జనరల్ బాడీ జాయింట్ సెక్రెటరీ శోభ దొనే, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: ప్లంబర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ సంఘం (ఐఎఫ్‌టీయూ) అనుబంధ ప్లంబర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ప్లంబర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పంబ్లర్స్ యూనియన్ నాయకులు నర్సింగ్, శేషరావు, సంజయ్, జనార్దన్, అఖిల్, కైసర్, హమీద్, అశోక్, ప్రదీప్, నవనీత్, దేవిదాస్, రమాకాంత్, సంతోశ్, సత్యనారాయణ, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

బోథ్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టాస్క్ ఇన్‌స్ట్రక్టర్ మోహద్ అబ్దుల్ ముఖీద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి గురించి వివరించారు. ఆయా రంగాల్లో రాణించాలంటే కచ్చితంగా నైపుణ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఢిల్లీలో నిరసన ర్యాలీ

ఆదిలాబాద్‌టౌన్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలో నిరసన ర్యాలీ తలపెట్టినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొమురంభీం భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు అధికసంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు అశోక్ జైతుకుమార్, దుర్గాప్రసాద్, నిఖిల్, మహిపాల్, మహేశ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉట్నూర్‌రూరల్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే అవకాశం ఉపాధ్యాయులకే దక్కుతుందని గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గల బీఎడ్ కళాశాల, క్రీడా పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట డీడీ దిలీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, అధ్యాపకులు కపిల్‌కుమార్ జాదవ్, డీవీరావ్, మానిక్‌రావు, రామారావు, జగన్, రాందాస్, రవి, శ్రీనివాస్, సుష్మిత పాల్గొన్నారు.

ముగిసిన గంగ జాతర


పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగ నది తీరంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న జాతర గురువారంతో ముగిసింది. చివరి రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గంగమ్మ తల్లి ప్రత్యేక పూజలు చేశారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అక్కడే పిండి వంటలు వండుకున్నారు. అమ్మవారిని నైవేద్యం సమర్పించి, భోజనాలు చేశారు. రామానంద్, మధవ్‌రావ్ మహరాజ్ ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

సీఎం సభ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

బేల/జైనథ్/ఆదిలాబాద్‌రూరల్: ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని సభ ఇన్‌చార్జి పటేల్ రమేశ్‌రెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం బేల, జైనథ్ మండల కేంద్రంలో, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రామాయి గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు ఫెజుల్లాఖాన్, నాక్లే రాందాస్, గుండవార్ సంజయ్, గావుండే ఘణేశ్యాం, బొక్రే శంకర్, బాలూరి గోవర్ధన్ రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, గిమ్మ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.
తాంసి: ఇంద్రవెల్లిలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో వివిధ గ్రామాల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సభ విజయవంతం చేసేందుకు ప్రతీ గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు రామన్న యాదవ్, రాకేశ్, నారాయణ, సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం


బ్రహ్మానందంను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నేరడిగొండ: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా నాయకులు ఆయనకు ఘనంగా సన్మానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. మరోసారి భారీ మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోనయ్య హీరాసింగ్, ప్రధాన కార్యదర్శులు సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి ప్రశాంత్, గుడిహత్నూర్ ఎంపీపీ భరత్, కదం బాపురావు పటేల్, గంధం నవీన్, తొడసం శంకర్, చొక్కపెల్లి రాములు, గట్టు నారాయణ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నాయీ బ్రాహ్మణ కుల సభ్యులు గురువారం బీహార్ మాజీ ముఖ్యమంత్రి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడాన్ని హర్షస్తూ.. ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల కోసం, వ్యవసాయ కార్మికుల కోసం, రైతుల కోసం ఠాకూర్ ఎంతో కృషి చేశారని, తన కృషిని గుర్తించి భారతరత్న ప్రకటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కులసంఘ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన చేపడుతామని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రాధ స్పష్టం చేశారు. గురువారం సంఘం సభ్యులతో కలిసి జిల్లా సంక్షేమ అధికారి మిల్కాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు డిసెంబర్‌లో గౌరవ వేతనం చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కంది పప్పు బదులు సోయా పప్పు సరఫరా అవుతుందని అధికారి దృష్టికి తీసుకొచ్చారు. కోడిగుడ్లు చిన్న సైజువి ఇస్తున్నారని, కారం, పసుపు, చింతపండు నాణ్యతగా లేవన్నారు. కార్యక్రమంలో కవిత, సుజాత, మీనాక్షి, సునంద, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ ఎమ్మెల్యేకు సన్మానం

బోథ్: సొనాల గ్రామానికి వచ్చిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ ఇంటికి వచ్చిన శ్రీనివాస్‌ను నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆడె గజేందర్, గుడాల శేఖర్, రామాయి రవి, లోలపు పోశెట్టి, గుడాల అనీష్ పాల్గొన్నారు.

సమాచారం

పూలాజీబాబా ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో గురువారం పూలాజీ బాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్‌సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం

బేల: మండలంలోని పాటన్ గ్రామంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగింపు సందర్భంగా గురువారం సర్పంచ్ ఫైజుల్లాఖాన్‌ను గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ గణేష్‌కు పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుహాసిని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

లేబర్ కార్డులు అందజేత

ఎదులాపురం: భవన నిర్మాణ కార్మిక సంఘంలో భాగమైన బిల్డింగ్ పేయింటర్స్ 50 మందికి భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు లేబర్ కార్డులు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం వారికి లేబర్ కార్డులు అందజేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, ఎస్‌కే నూర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పటుపడతాం

సిరికొండ: పదవిలో ఉన్నా.. లేకున్నా గ్రామాభివృద్ధికి పటుపడుతామని సిరికొండ గ్రామ సర్పంచి ఓరగంటి నర్మాద అన్నారు. ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగిసిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో మాట్లాడారు. అలాగే ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంను పాలకవర్గం సభ్యులు సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బేల: మండల కేంద్రంలో శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి మండల ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం భూమిపూజ చేశారు. సర్పంచ్ ఇంద్రశేఖర్, సభ్యులతో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేత

ఇచ్చోడ: మండలంలోని కోకసమన్నూర్ గ్రామస్తులు గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను నేరడిగొండలో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 3న నిర్వహించనున్న శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవానికి రావాల్సిందిగా కోరారు. సర్పంచ్ గంగారాం, నరాల శ్రీనివాస్, కమ్మరి సుదర్శన్, బీమ హన్మండ్లు, కాండ్లి విశ్వనాథ్ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని వినతి

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ బోథ్ పట్టణ అధ్యక్షుడు సల్ల రవి గురువారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసినట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీవోలు

నార్నూర్: బదిలీపై వచ్చిన ఎంపీవో గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనందస్వామి నార్నూర్ ఎంపీవోగా, ఇచ్చోడ ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న రమేశ్‌ను గాదిగూడ ఎంపీవోగా బదిలీపై వచ్చారు.

మంత్రికి వినతి

ఆదిలాబాద్‌టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను గురువారం కలిశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో గురువారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

'అమలు కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్'

ఆదిలాబాద్‌టౌన్: అమలుకు సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, ప్రజలు కాంగ్రెస్‌ను వ్యతిరేకించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని 20, 21, 24వార్డుతో పాటు గాంధీనగర్‌లో గురువారం నిర్వహించిన సమావేశాలకు హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధత, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా క్షేత్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చేంత వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి రమేశ్, స్వరూపారాణి, బొడగం మమత, అశోక్ స్వామి, కొండ గణేష్, బుట్టి శివకుమార్, మహేందర్ పాల్గొన్నారు.